క్లుప్తంగా

చెక్కుల పంపిణీ

చండ్రుగొండ: తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెకులను ఎంపీపీ పార్వతి పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 14 మందికి చెక్కులు అందించారు. తహసీల్దార్ వి.రవికుమార్, ఎంపీటీసీలు దార వెంకటేశ్వరరావు, లంకా విజయలక్ష్మి, ఎస్డీ రసూల్, సర్పంచ్‌లు పూసం వెంకటేశ్వర్లు, బాణోత్ రణ్యా,మెడా మోహన్‌రావు ఆర్‌ఐ ముత్తయ్య పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన

అశ్వారావుపేటరూరల్: బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌కు సంబంధించిన ఫోన్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్ట విరుద్ధంగా ట్యాపింగ్ చేయడంపై.. స్థానిక రింగ్‌రోడ్ సెంటర్ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మడకం ప్రసాద్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు జక్కుల చిన్ని, జున్ను రవి, కాశిని వెంకటేశ్వర్లు, గొల్లమందల పెంటయ్య, తగరం రాంనివాస్, పాదిలి వెంకటేష్, రాయల పోలయ్య, షేక్ జిలానీ, నార్లపాటి నరేష్, రాయల సుహాసిని, రాణి పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

బూర్గంపాడు: అకారణంగా తమ ఇంటిపైకి వచ్చి దాడికి పాల్పడిన నిందితులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బూర్గంపాడు గ్రామపంచాయతీ వార్డు సభ్యులు దేగల ధర్మయ్య, ముత్యాలు దంపతులు డిమాండ్ చేశారు. బూర్గంపాడు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం కుటుంబసభ్యులతో కలసి మాట్లాడారు. ఈ నెల 1వ తేదీని తాను ఇంట్లో లేనప్పుడు తమ ఇంటికి బూర్గంపాడుకు చెందిన ముగ్గురు యువకులు వచ్చి బూతులు తిడుతూ భార్య ముత్యాలుపై దాడికి పాల్పడ్డారని ధర్మయ్య ఆరోపించారు. నీ భర్తను చంపుతామని, మీ సంగతి చూస్తామన్నారని బెదిరించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని అదేరోజు బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఇప్పటి వరకు పట్టించుకోలేదని ఆరోపించారు.

కుండీల్లో మొక్కలు..

భద్రాచలంఅర్బన్: గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని చప్టా దిగువన ఉన్న లక్ష్మీనరసింహాస్వామి ఆలయం ఎదుట కుండీల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కురిచేటి శ్రీనివాసరావు పాల్గొని మొక్కలు నాటి, గ్రీన్ భద్రాద్రి సేవలు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షుడు కామిశెట్టి కృష్ణార్జున రావు, గోళ్ల భూపతిరావు, ఉడతా రమేష్, వెంకటేష్, నర్సింహాస్వామి, ఆలయ అర్చకులు శ్రీనివాసచారి, ప్రియాంక, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

టోర్నమెంట్‌కు వితరణ

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమై కట్టుబట్టలతో మిగిలిన గుంజాల కృష్ణ కుటుంబానికి దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు బుధవారం దుస్తులు, వంట గిన్నెలు, బియ్యం నిత్యావసర వస్తువులు వితరణగా అందజేశారు. భారజల కర్మాగారం ఉద్యోగి ఎం.వెంకటేశ్వర్లు, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొడాలి వెంకటేశ్వరరావు రూ.వెయ్యి నగదును అందజేశారు. కొందరు గ్రామస్తుల నుంచి రూ.15,200 వేలు విరాళం రాగా.. సర్పంచ్ కోడి కృష్ణవేణి చేతుల మీదుగా కృష్ణ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, న్యాయవాది సింగం శ్రీధర్, స్థానికులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

భద్రాచలంఅర్బన్: గిరిజన సంక్షేమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీవేజ్, ఔట్ సోర్సింగ్ కార్మికుల బకాయి వేతనాలు ఇప్పించడంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ విఫలం చెందారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మచారి విమర్శించారు. బుధవారం భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డులో ఆ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. కార్మికులకు గత 22 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, ఎనిమిది సార్లు మంత్రికి వినతి పత్రాలు అందించినా ఫలితం శూన్యం అన్నారు. సంఘం నాయకులు ఎస్.నాగరాజు, జిల్లా కార్యదర్శి ఎ.హీరాలాల్, నాగమణి, సుభద్ర, శ్యామల, శ్రీను పాల్గొన్నారు.

కేసులు నమోదు చేయాలి

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో అక్రమంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల ఇళ్ల నిర్మాణంపై ఎల్‌టీఆర్ కేసులు నమోదు చేయాలని ఏపీఎస్పీ డివిజన్ అధ్యక్షుడు సొందె మల్లూరు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్ష్మీ నగరంలో కొంత మంది గిరిజనేతరులు విచ్చలవిడిగా షాపింగ్ కాంప్లెక్స్‌ల కోసం 1/70 చట్టానికి విరుద్ధంగా భారీ కట్టడాలు నిర్మిస్తున్నారని, వీరికి అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోకపోతే భద్రాచలం పీఓ, జిల్లా కలెక్టర్‌లకు ఫిర్యాదు చేయవలసి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కోసం మురళి, నరసింహారావు, వెంకట రమణ, కృష్ణ మూర్తి పాల్గొన్నారు.

గిరిజనుల కల సాకారం

- ఎల్‌ఎల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం
- పూర్తి కావొచ్చిన కల్వర్టుల నిర్మాణం
- ఇక గ్రామాల్లో వాహనాల మోతే..



మరమ్మతులు చేపట్టనున్న ఎల్‌ఎల్ రోడ్డు ఇదే..

దుమ్ముగూడెం: ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఎల్ ఎల్ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభం కావడంతో గిరిజన ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 20 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 20 కోట్ల నిధులను కేటాయించాయి. ములకపాడు నుంచి లక్ష్మీపురం వరకు ఆర్ అండ్‌బీ శాఖ అధ్వర్యంలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ములకపాడు నుంచి లక్ష్మీపురం వరకు ఉన్న రహదారిలో ములకపాడు నుంచి ఆర్లగూడెం వరకు రహదారి మెత్తం గోతులమయంగా మారి వర్షాకాలంలో గిరిజన గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే వారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే వారికి ఈ సమస్య తీరినట్టే.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రతి మారుమూల గ్రామం నుండి మండల కేంద్రానికి డబుల్ రోడ్డు నిర్మాణం చేపడతామని ముఖ్యమంత్రి కేసీఆర్ పలు సందర్భాల్లో చెప్పిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగానే గత నాలుగేళ్ల క్రితం ఎల్‌ఎల్ రోడ్డు నిర్మాణానికి అధికారులు ప్రతి పాదనలు పంపారు. తెలంగాణలోని కొన్ని గ్రామలతో పాటు ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని పలు ప్రాంతాలకు చేరుకునేందుకు ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. 7 మీటర్ల వెడల్పుతో నిర్మించే ఈ రహదారి వల్ల ఇక గిరిజన గ్రామాల్లో వాహనాల సందడి బాగా పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎల్‌ఎల్ రోడ్డు నిర్మాణంలో 26 కల్వర్టులను నిర్మించనున్నారు. ఘాటీ మార్గంలో ప్రయాణంలో గమ్య స్థానాలను చేరుకోవడానికి చేయాల్సిన ప్రతి ఒక్కరూ ఈ రహ దారి పైనే ప్రయాణించాల్సి ఉండడం విశేషం. ములకాపాడు గ్రామంలోని ఆర్‌అండ్‌బీ ప్రధాన రోడ్డు నుంచి చేరుపల్లి గ్రామం వరకు సుమారు 20 కిలోమీటర్ల మేర బీటీ రాహదారి నిర్మాణం చేపట్టనున్నారు. ఇప్పటికే కల్వర్టుల నిర్మాణం ప్రారంభం అయ్యి పూర్తి కావస్తుండటంతో రోడ్డు నిర్మాణం త్వరగానే పర్తయ్యే అవకాశాలు ఉన్నాయి.

నక్సల్స్ ప్రభావిత ప్రాంత నిధులు..

లక్ష్మీనగరం–లక్ష్మీపురంగా పిలువబడే ఎల్‌ఎల్ బీటీ రోడ్డు నిర్మాణానికి నక్సల్స్ ప్రభావిత ప్రాంత అభివృద్ధి నిధులతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం నిధులు కలుపుకుని పనులను చేపట్టనున్నారు. కేంద్ర ప్రభుత్వం వాటా 60శాతం కాగా రాష్ట్రప్రభుత్వం నిధులు 40 శాతంతో నిధులు మంజూరు కాగ రాష్ట్ర ఆర్‌అండ్‌బి శాఖ ఆధ్వర్యంలో పనులను చేపట్టారు. కల్వర్టుల నిర్మాణం ఇప్పటికే ప్రారంభం అయ్యి పూర్తయ్యే స్థితికి వచ్చాయి. కల్వర్టుల నిర్మాణం అనంతరం రోడ్డు వెడల్పు పనులు చేపట్టి అవసరం అయ్యిన దగ్గర రోడ్డు డైవర్షన్ ఇస్తున్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి ఈ ఏడాది ఎండాకాలం లోపు పనులను పూర్తి అయ్యేలా పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ వడివడిగా పనులను చేస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తయితే ప్రయాణం సాఫీగా సాగుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల బాధలు తీరినట్టే..

ఎల్‌ఎల్ రోడ్డు నిర్మాణం ప్రారంభం కావడం చాలా సంతోషకరం. ఈ రహదారి గోతులమయంగా మారి ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. నిధులు మంజూరు కావడంతో పాటు కాంట్రాక్టర్ పనులను ప్రారంభించడంతో గిరిజన గ్రామాల ప్రజల బాధలు తీరినట్టే. పనులను దక్కించుకున్న కాంటాక్టర్ నాణ్యతగా పనులు చేపట్టేలా అధికారుల పర్యవేక్షణ చేయాలి.

– కొర్సా నరసింహారావు, ఆర్లగూడెం ఉపసర్పంచ్

పనులు త్వరగా పూర్తి చేయాలి

ఎల్‌ఎల్ రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను నాణ్యతతో త్వరితగతిన చేపట్టి పనులు పూర్తి చేయాలి. మారాయిగూడెం నుంచి లక్ష్మీనగరం ఈ రహదారిపై రావాలంటేనే భయం వేసేదని ఇప్పుడు నిధులు మంజూరు కావడంతో పాటు పనులు ప్రారంభం కావడంతో ఈ రహదారిపై వాహనాల ప్రమాణం సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

– తొడెం తిరుపతిరావు, మారాయిగూడెం సర్పంచ్

త్వరలోనే పూర్తి చేస్తాం..

ఎల్‌ఎల్ రోడ్డు నిర్మాణ పనులను త్వరితిగతంగా పూర్తి చేయడానికి శాయశక్తుల కృషి చేస్తాం. పనుల నాణ్యత విషయంలో ఎక్కడ కూడా రాజీ పడే అవకాశాలు లేవు. రోడ్డు నిర్మాణంలో 26 కల్వర్టుల నిర్మాణం చేపట్టడం జరుగతుంది. కల్వర్టుల నిర్మాణ పనులు ప్రారంభం అయిన నేపథ్యంలో రోడ్డు నిర్మాణ పనులు కూడా తొందరగానే పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి.

– హరిలాల్, ఆర్‌అండ్‌బీ డీఈ

పోలీస్ స్టేషన్‌లో తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్‌బాబు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను కొత్తగూడెం డీఎస్పీ వెంకటేశ్వర్‌బాబు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి శాంతి భద్రతల విషయాలను ఎస్సై విజయను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారి వివరాలు పోలీసులకు తెలిపాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ వసంతకుమార్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



వ్యాధి బాధితుల విశ్రాంతి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటలో మెరుగైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా వసతులు, వైద్యులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో బుధవారం ఆయన ఆపరేషన్ థియేటర్, ఎన్‌సీడీ క్లినిక్, వెయిటింగ్ హాల్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించి, మాట్లాడుతూ.. ఇక్కడి వైద్యపరమైన సమస్యలను మంత్రి హరీష్‌రావు దృష్టికి తీసుకెళ్లిగా.. ఆయన ఆస్పత్రిలో 9 వైద్యుల పోస్టులతోపాటు, వైద్య పరికరాలను మంజూరు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నంశెట్టి వరలక్ష్మి, పైడి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు నార్లపాటి సుమతి, సాధు జోత్స్నబాయి, డీసీసీబీ డైరెక్టర్ నిర్మల పుల్లారావు, సొసైటి చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నారం రాజశేఖర్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మందపాటి రాజమోహన్‌రెడ్డి, బిర్రం వెంకటేశ్వరరావు, సాంబశివరావు, వెంకన్న, సంపూర్ణ పాల్గొన్నారు.

వృద్ధుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

కరకగూడెం: వృద్ధుల ఆరోగ్యం పట్ల ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కరకగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి బైరిశెట్టి దుర్గా నరేష్ సూచించారు. గత మూడు రోజుల నుంచి స్థానిక పీహెచ్‌సీలో ఉమ్మడి మండలాలైనా పినపాక, కరకగూడెంలకు చెందిన ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలకు జరుగుతున్న సీహెచ్‌సీ శిక్షణ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జి.భద్రమ్మ, పీహెచ్‌ఎన్ ఎం.సుగుణాదేవి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

భద్రాచలం: బాసర అమ్మవారితో పాటుగా హిందూ దేవుళ్లపై అనుచిత వాఖ్యలను చేస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని భద్రాచలం దేవస్థానం ఉద్యోగుల సంక్షేమ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. దేవస్థాన ఈవో క్యాంపు కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. హిందువుల మనోభావాలు దెబ్బతినేవిధంగా కొంత మంది ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరెడ్డి, శ్రవణ్‌కుమార్, భవాని రామకృష్ణ, రామారావు, నిరంజన్, సునీత, ఇతరులు పాల్గొన్నారు.

ఎమ్మెస్పీ ఆవిర్భావ దినోత్సవం



భద్రాచలంటౌన్: జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెస్పీ నాయకులు

మణుగూరుటౌన్: మణుగూరు మండల కేంద్రంలో మహాజన సోషలిస్ట్ పార్టీ పదో ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఎమ్మెస్పీ పినపాక నియోజకవర్గ కోఆర్డినేటర్ బోయిళ్ల వెంకటేశ్వర్లు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల పరంగా న్యాయం జరగాలంటే మహాజన నేత మంద కృష్ణమాదిగ నాయకత్వంలో ఎమ్మెస్పీ ద్వారానే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ము హుస్సేన్, ఉసికల కొండయ్య, అర్ర కనకయ్య, బాబురావు, రమేష్, కిరణ్, నరసింహారావు, రాయలింగు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: పట్టణంలోని జగదీష్ కాలనీలో ఎమ్మెస్పీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం పార్టీ భద్రాచలం నియోజకవర్గ కోఆర్డినేటర్ అలవాల రాజా బుధవారం జెండా ఆవిష్కరించారు. ఈ నెల 11న బెంగుళూరులో జరిగే పార్టీ జాతీయ సదస్సుకు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కొమ్మగిరి వెంకటేశ్వరరావు, తీగల ప్రదీప్, ప్రభాకర్, రాజు, సాయి, సురేష్, రాజేష్, వెంకన్న, మోహన్‌రావు, శంకర్, సూర్యవాణి, లత, రమాదేవి, సమ్మక్క పాల్గొన్నారు.

మైనర్ బాలిక అదృశ్యం

అశ్వారావుపేటరూరల్: ఓ మైనర్ బాలిక కనిపించకుండా పోవడంతో పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్సై సాయికిశోర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నారంవారిగూడెం కాలనీ గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఈ నెల 3వ తేదీన అశ్వారావుపేట ప్రభుత్వ పాఠశాలకు టీసీ కోసం వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదు. దాంతో కుటుంబీకులు తమ బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీయగా ఆచూకీ లభ్యం కాలేదు. బాలిక అదృశ్యం కావడంపై తండ్రి చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదుపై ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ అంతరాయం

పినపాక: నేడు మండలంలోని దుదినేపల్లి, జానంపేట, అమరారం, టీ కొత్తగూడెం పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిల్పివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కావ్య బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. విషయాన్ని ప్రజలు గమనించి సంబందిత అధికారులకు సహకరించాలని కోరారు.

7న వేలం పాటలు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి 22వ జాతరలో దుకాణాల నిర్వహణకు ఈ నెల 7వ తేదీన ఉదయం 10 గంటలకు ఆలయ ఆవరణలో వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చుక్కా గణేష్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 6వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ముత్యాలమ్మ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ

ములకలపల్లి: మండలపరిధిలోని సాయిరాంపురం గ్రామ క్రీడాకారులకు వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. బుధవారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సోయం వీరభద్రం వాటిని అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి సోయం కృష్ణ, యువజన విభాగం మండల అధ్యక్షుడు తాటి రమణ, ఇర్పా ప్రతాప్, ప్రవీణ్, గద్దం వెంకటేష్, సున్నం రాజులు, విజయరావు, కీసరి నాగరాజు, తానం శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

అశ్వారావుపేటరూరల్: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఆవరణలో బుధవారం భద్రాచలం ఐటీడీఏ, ఆరోగ్య శాఖ సంయుక్తంగా నిర్వహించి మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించగా, రోగులకు ప్రముఖ వైద్య నిపుణులు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. శిబిరానికి దాదాపు 450 మంది రోగులు హాజరు అయినట్లు ఆస్పత్రి సుపరింటెండెంట్ డాక్టర్ జయలక్ష్మి తెలిపారు. శిబిరంలో వైద్యులు అరుణ్‌కాంత్, కృష్ణకాంత్, మౌనిక, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటో స్టార్టర్లపై రగడ



విద్యుత్ శాఖ అధికారులతో వారిస్తున్న రైతులు

పినపాక: మండలంలో రైతులు పంట పొలాల్లో మోటర్లకు అమర్చిన ఆటోస్టార్టర్లపై ఘర్షణ వాతావరణం నెలకొంది. విద్యుత్ శాఖ అధికారులు పంట పొలాల్లోని ఆటో స్టార్టర్లను బుధవారం తొలగిస్తూ వచ్చారు. అలా చేస్తే తమ పంటలు ఎండుతాయంటూ రైతులు వారిని అడ్డుకున్నారు. కరెంట్ పోయి వచ్చినప్పుడల్లా పొలాలకు వచ్చి మోటార్లు ఆన్ చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అధికారులకు, రైతులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. విద్యుత్ శాఖ ఏఈ కావ్య పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అధికారుల విధులకు అడ్డుపడితే కఠిన చర్యలు ఉంటాయని వివరించారు. పొలాల్లో స్టార్టర్లను తొలగిస్తే ఎటువంటి కేసులను ఎదుర్కోడానికైనా సిద్ధంగా ఉన్నామంటూ రైతులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

మైనారిటీ సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..



విప్‌కు శుభాకాంక్షలు చెబుతున్న బీటీపీఎస్ సీఈ

కరకగూడెం: మైనారిటీ సంక్షేమానికి కట్టుబడి ఉన్నానని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. బుధవారం కరకగూడెం కోఆప్షన్ సభ్యుడు షేక్ సోందు పాషా ఆధ్వర్యంలో మండల బీఆర్‌ఎస్ మైనారిటీ సెల్ నాయకులు.. క్యాంపు ఆఫీసులో విప్ రేగాను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మండలంలోని పలు మసీదులలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ ఫజల్ హుస్సేన్, షేక్ ఖలీల్ పాషా, యాకూబ్, ఖమ్రున్, షేక్ యాకూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

విప్‌ను కలిసిన బీటీపీఎస్ సీఈ

మణుగూరురూరల్: మణుగూరులోని క్యాంప్ కార్యాలయంలో విప్ రేగా కాంతారావును మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ సీఈ బి.బిచ్చన్న బుధవారం కలిశారు. ఈ సందర్భంగా రేగాకు సీఈ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపాక పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో బీటీపీఎస్ సెక్యూరిటీ, విజిలెన్స్ అధికారి పి.రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. కాగా, మున్నూరుకాపు సంక్షేమ సంఘం మండల కమిటీ ఆధ్వర్యాన రూపొందించిన క్యాలెండర్లను విప్ కాంతారావు ఆవిష్కరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, జెడ్పీటీసీ పోశం నర్సింహరావుతో పాటు వన్నం కృష్ణమోహన్, గాండ్ల సురేష్ పాల్గొన్నారు. కాగా, ఆళ్లపల్లి మండలానికి చెందిన 40కుటుంబాల వారు వివిధ పార్టీలకు రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కాంతారావు కండువాలు కప్పి ఆహ్వానించారు.

దుస్తులు వితరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని బ్రెస్ దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు నూతన దుస్తులను బుధవారం అందజేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని దుర్గా స్వీట్స్ యజమాని బిర్రు సుధాకర్, సరిత దంపతులు 50 మంది విద్యార్థులకు రూ.25 వేల విలువ చేసే దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, స్వీట్స్ పంచి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సాకేత్, శ్రీనివాస్, ప్రకాష్, కార్తికేయ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ

మణుగూరురూరల్: మణుగూరు ఏరియా సింగరేణి ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సరం క్యాలెండర్లను సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం వెంకటేశ్వరరెడ్డి బుధవారం జీఎం కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ధనసరి వెంకటేశ్వర్లు(ఏజీఎం సివిల్), వాడే అప్పారావు(డిప్యూటి మేనేజర్), పూనెం కాంతారావు, చాట్ల బొర్రయ్య, సూర్నాక వెంకటేశ్వర్లు, వజ్జా వెంకటేశ్వర్లు, గుంపెనపల్లి శ్రీను, బి.వెంకటేశ్వర్లు, వట్టం కృష్ణయ్య, శాంతయ్య, పొదెం శ్రీను, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట: ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్లను బుధవారం ఆవిష్కరించారు. స్థానిక ఎస్‌టీఓ కార్యాలయంలో ఎస్టీఓ రఫీయా సుల్తానా చేతుల మీదుగా ఏటీఏ క్యాలెండర్లను ఆవిష్కరించి, పంపిణీ చేశారు. సంఘం సమావేశంలో మండల అధ్యక్షుడు రాజేష్ మాట్లాడారు. సంఘం బాధ్యులు సున్నం ప్రసాద్, ఈ.రాజేష్, ఈ.సీతారాములు, పి.రాము, టి.శ్రీను, పి.రాము, కె.రాజేష్ పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం

అశ్వాపురం: మండల కేంద్రంలో చవిటిగూడెం గ్రామానికి చెందిన షేక్ షాజిదా అనారోగ్యంతో బాధపడుతుండటంతో వైద్య ఖర్చులకు ముస్లిం మైనారిటీ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో బుధవారం రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ సంక్షేమ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ యాకూబ్‌ఆలీ, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ చాంద్‌పాషా, మండల అధ్యక్షుడు షేక్ సత్తార్ తదితరులు మాట్లాడారు.

శిక్షణా శిబిరంలో నాయకులు

భద్రాచలం: హైదరాబాద్‌లో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధరణి హాత్ జోడో అభియాన్ ఎన్నికల కమీషన్ మీడియా, సోషల్ మీడియోపై ఒక్క రోజు అవగాహన శిబిరంలో పార్టీకి చెందిన భద్రాచలం డివిజన్ నాయకులు పాల్గొన్నారు. డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య ఆధ్వర్యంలో బృందం సభ్యులు టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, నల్లపు దుర్గా ప్రసాద్, నాయకులు బలుసు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బూసిరెడ్డి దంపతులకు సన్మానం



బూసిరెడ్డి శంకర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న రోటరీక్లబ్ ఆఫ్ భద్రాచలం సభ్యులు

భద్రాచలంఅర్బన్: రోటరీ ఇంటర్నేషనల్ అసెంబ్లీకి అమెరికా వెళ్తున్న డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డిని, ఆయన సతీమణిని క్లబ్ సభ్యులు అధ్యక్షుడు వసంతరావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. రెండు తెలుగు రాష్ట్రాలకు రోటరీ ఇంటర్నేషనల్ గవర్నర్ స్థానంలో ఆయన సమావేశాల్లో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో భద్రాచలం క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించి విదేశీయాన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ గవర్నర్ జే.అబ్రహం, ప్రసాదరావు, పాపన్న, శేషగిరిరావు, మహమ్మద్ రఫీ, గుడికందుల నాగేశ్వరరావు, జక్కం వేణుగోపాలరావు, సానికొమ్ము బ్రహ్మరెడ్డి, మందపాటి సుధాకర్ రెడ్డి, పచ్చినీలం మునికేశవ్, చేబ్రోలు జకరయ్య, గంజి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

పొంచి ఉన్న ప్రమాదం



పట్టణంలోని వెంకటేశ్వర కాలనీ 3వ లైన్‌లో శివాలయం సమీపంలో రహదారి ప్రమాదకరంగా ఉంది. డ్రెయినేజీ కల్వర్టుకు ఇరువైపుల సైడ్ వాల్స్ లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. రాత్రి సమయంలో వాహనదారులు గమనించక రోడ్డు పక్కకు దిగి ప్రమాదాల బారినపడి గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టుకు ఇరువైపుల సైడ్‌వాల్స్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

– భద్రాచలంటౌన్

ప్రశ్నించాల్సిన అధికారి: వెంకటేశ్వర్లు, పంచాయతీ ఈఓ
ఫోన్ నంబర్: 95050 13090